



దర్శనమిస్తున్న లింగమయ్య

# విద్యతోనే.. మార్పు



'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

- వ్యవసాయ కుటుంబం నుంచి కలెక్టర్ స్థాయికి..
- విద్యలో గుణాత్మక మార్పుల కోసమే కృషి చేస్తా
- జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక
- చెంచు కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ
- గిరిజన కార్పొరేషన్ అవినీతిపై సమగ్ర విచారణ
- ఏప్రిల్‌లోగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల భూసేకరణ పూర్తి
- 'ఆంధ్రజ్యోతి'తో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : అభ్యుదయం, చైతన్యం ఆర్థిక స్థితిగతుల మెరుగుదల అనే అంశం కేవలం విద్యతోనే ముడిపడి ఉంది. విద్యా వ్యాప్తి ద్వారా సామాజిక చైతన్యంతో పాటు పేదరిక నిర్మూలన కూడా సాధ్యమవుతుందని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. ఐఏఎస్‌గా ఎంపిక కాకుండా ఉండి ఉంటే ప్రైవేట్ స్కూల్‌ను నెలకొల్పి అందులో టీచర్‌గా పని చేయాలనేది జీవిత ఆశయంగా ఉండేదని ఆయన చెప్పారు. స్వల్ప కాలంలోనే జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులతో సత్సంబంధాలు ఏర్పడ్డాయన్నారు. జిల్లా భౌగోళిక స్వరూపం, ఇక్కడి ప్రాంతం ప్రజల ప్రేమ ఆ ప్యాయతలు తనను ఎంత గానో ప్రభావితం చేశాయని చెప్పారు. కల్వకుర్తి పాలమూరు రంగారెడ్డి ఎత్తి పోతల పథకాల ద్వారా ప్ర జల జీవన స్థితిగతుల్లో క్రమంగా మార్పు వస్తుందన్నారు. పంట పొలాలకు సాగునీరందడంతో వలసలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని పేర్కొన్న కలెక్టర్ వ్యవసాయీకరణ తర్వాత రెండవ దశలో పారిశ్రామీకరణ జరిగితే జిల్లాలో జనం ఆర్థిక ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించే దిశగా పాలన యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు ఆయన విశదీకరించారు. అట్టడుగు స్థాయి నుంచి జిల్లా కలెక్టర్‌గా ఎదిగిన బదావత్ సంతోష్‌ను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. జిల్లా అభివృద్ధికి ఆయనకున్న ప్రణాళిక కుటుంబ నేపథ్యం ఆయన మాటల్లోనే..

**మీ స్వస్థలం.. కుటుంబ నేపథ్యం ఏమిటీ?**

మాది పూర్తిగా వ్యవసాయ కుటుంబం. నా స్వస్థలం జనగాం జిల్లా, జఫర్‌ఘడ్ మండలం సూరారం. నా తం డ్రి హరిలాల్ వ్యవసాయదారుడు. మా గ్రామంలో ఐదె కరాల పొలం ఉంది. ముగ్గురం అన్నదమ్ములం. 1995 నుంచి 2002వరకు నా ప్రాథమిక విద్యాభ్యాసం సూరా రంలోని ప్రభుత్వ పాఠశాలలో కొనసాగింది. ఆ తర్వాత పాలకుర్తిలో పదవ తరగతి, హనుమకొండలోని ఎస్‌వీ ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌ను పూర్తి చేశాను. ఆ తర్వాత వరంగల్‌లో నీట్‌లో ప్రవేశం దక్కింది. అక్కడ కోర్సు పూర్తి చేశాక హిందూస్తాన్ ఏరోనాటిక్ కంపెనీలో ఉద్యోగ అవకాశం దక్కింది. మూడేళ్ల పాటు అక్కడే పని చేశాను.

**ఐఏఎస్ కావాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

విద్య ద్వారానే చైతన్యం, ఆర్థికంగా నిలదొక్కుకుంటామనే భావన నా చిన్ననాటి నుంచి ఉంది. ఇదే నన్ను ఐఏఎస్‌కు ప్రిపేరయ్యేలా చేసింది. విద్యా వ్యవస్థను అణగారిన వర్గాలకు చేరువ చేయగలిగే అధికారం.. అందుకోసం క్షేత్రస్థాయిలో కృషి చేయగలిగే భాగస్వామ్యం కలెక్టర్ అయితేనే సాధ్యమవుతుందనే ప్రగాఢ విశ్వాసంతో ముందుకెళ్లాను. మొదటిసారి గ్రూప్-1 పరీక్షలు రాసినప్పుడు నాకు సానుకూలమైన ఫలితాలు రాలేదు. అమ్మా నాన్నల ప్రోత్సాహం, మిత్రుల సహకారం, వారి ప్రోత్సాహంతో రెండవసారి విజయం సాధించాను.

**విద్యా వ్యవస్థలో ఎలాంటి మార్పులు తీసుకురావాలనుకుంటున్నారు?**

విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమల్లో ఉన్నాయి. కావాల్సిందల్లా వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన చిత్తశుద్ధి మాత్రమే. దీనిపైనే ప్రధానంగా ఫోకస్ పె ట్టాను. నేను కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రతీ చోట దృష్టి అంతా విద్యా సంస్థలపైనే పెట్టాను. ఇప్పటికీ జిల్లాలోని ఏ ప్రాంతానికి వెళ్లినా కచ్చితంగా ఏదో ఒక స్కూల్ లేదా హాస్టల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థుల తో కలిసి భోజనం చేస్తాను. ఇదొక్కటే కాదు విద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాను. ప్రతీ హాస్టల్, రెసిడెన్షియల్ స్కూల్ కు స్పెషల్ ఆఫీసర్లను నియమించాను. నాణ్యమైన ఆహారం, పరిసరాల

(మిగతా 8లో..)





శంకం ఊదుతున్న భక్తుడు



లింగమయ్య దర్శనం కోసం తరలొచ్చిన భక్తులు

# పోటెత్తారు..

## లింగమయ్యా.. వస్తున్నామంటూ భక్తుల సాహస యాత్ర

- పౌర్ణమి రోజు దర్శనానికి భారీ జనసందోహం
- కిలో మీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు..
- తీవ్ర ట్రాఫిక్ సమస్య
- స్వామి దర్శనం కోసం 6 నుంచి 8 గంటల సమయం

అచ్చంపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దట్టమైన అభయారణ్యంలో రెండు కొండల నడుమ 1000అడుగుల లోతులో కొండ గుహలో ఉన్న మహిమాన్విత లింగమయ్యస్వామి చైత్ర పౌర్ణమి రోజున దర్శించుకుంటే తమ కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. శుక్రవారం రాత్రి తెల్లవారుజాము నుంచి శనివారం రాత్రి వరకు పౌర్ణమి ఘడియలు ఉండటంతో ఆ సమయంలో స్వామిని దర్శించుకోవాలన్న తపనతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో నల్లమల అభయారణ్యం భక్తజన సంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో స్వామి దర్శనం కోసం కిలో మీటర్ల మేర భక్తులు వేచిచూడాల్సిన పరిస్థితి. లింగమయ్య దర్శనం కోసం 6 నుంచి 8 గంటల సమయం పట్టింది. సలేశ్వర జాతర చరిత్రలో ఈ ఏడాది వచ్చిన భక్తులు ఎప్పుడూ రాలేదని నిర్వాహకులు తెలిపారు. పరహాబాద్ నుంచి 18కిలో మీటర్ల దూరంలో ఉన్న రాంపూర్ పెంట వరకు కిలో మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోవడం తో భక్తులు కాలి నడకన స్వామి దర్శనం కోసం రావాల్సి వస్తుంది. భక్తుల ఆకలిదప్పికలు తీర్చేందుకు మోకాళ్లకుర్వ సమీపం లో మణికంఠ, కృష్ణసేవా

(మిగతా 9లో..)

## దేవరగుట్టలో చిరుతల సంచారం

9

- పాదముద్రలు సేకరించిన అధికారులు

## హెచ్‌టీ వైర్లు తాకి డీసీఎం దగ్ధం

9

- జోగులాంబ గద్వాల జిల్లా లింగాపురంలో ఘటన
- దగ్ధమైన బొప్పాయి పండ్లు.. డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం



శోభాయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, భక్తులు

## కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

- ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- జైహనుమాన్ నినాదాలతో మారుమోగిన పాలమూరు వీధులు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఐజీ చౌహాన్, ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రాంమందిర్ నుంచి వీర హనుమాన్ విజయ యాత్ర మొదలైంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు చేసి, యాత్రను ప్రారంభించారు. రాంమందిర్ చౌరస్తా నుంచి గడియారం చౌరస్తా, బాలగంగాధర్ తిలక్ చౌరస్తా, న్యూటౌన్ మీదుగా టీటీడీ కల్యాణ మండపం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హనుమంతుడి చరిత్ర మనకు ఆదర్శమన్నారు. భగవంతుడిని ఏవిధంగా సేవించాలో, మన హృదయంలో ఎలా ప్రతిష్ఠించుకోవాలో తెలిపిన గొప్ప భక్తుడు హనుమంతుడన్నారు. ఆయన దివ్య ఆశీస్సులు మనందరిపై ఉండాలన్నారు. యాత్రలో భజన మండలి సభ్యుల కోలాటాలు, అడుగుల భజనలు ఆకట్టుకున్నాయి. భక్తి పాటలు, జై హనుమాన్.. జై శ్రీరాం నినాదాలు హోరెత్తాయి. మాజీ మం త్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా పాల్గొని, పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్దియాది రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సిం హ రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, వీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, లక్ష్మీనారాయణ బజరంగ్‌దళ్ కార్యకర్తలు, సంఘ్‌పరివార్, హిందువాహిని, పతంజలి యోగా, ధార్మిక సంఘాలు, గణేష్ మండపాలు, అయ్యప్ప, శివ మాల దీక్ష సమితుల సభ్యులు పాల్గొన్నారు.

**బందోబస్తును పరిశీలించిన డీఐజీ**

హనుమాన్ జయంతి ర్యాలీ బందోబస్తును జోగులాంబ గద్వాల జోన్-7 డీఐజీ ఎల్ చౌహాన్ ఎస్పీ జానకితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించారు.



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

## ఎట్టకేలకు పనులు షురూ



ట్యాంక్ బండ్‌పై నిర్మాణాలకు కలర్ వేస్తున్న కార్మికులు

- మినీట్యాంక్ బండ్ అభివృద్ధికి ముడా నిధులు
- మొదట లైటింగ్ పనులకు టెండర్
- నగర వాసుల హర్షం

8



# తస్మాత్ జాగ్రత్త

- వానాకాలం సాగు కోసం విత్తనాలు కొంటున్న రైతులు
- నారాయణపేట జిల్లాలో నకిలీలతో పొంచి ఉన్న ప్రమాదం
- ఈ నెల 10న లంకాలలో రెండు క్వింటాళ్ల నకిలీ లూజ్ పత్తి విత్తనాలు స్వాధీనం
- గత ఏడాది ఐదు కేసులు నమోదు



ఈ నెల 10న నర్వ మండలం లంకాలలో నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్న టాస్క్ పోర్స్ పోలీసులు

నారాయణపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాబోయే వానాకాలం సాగు కోసం నారాయణపేట జిల్లాలో రైతులు ముందస్తుగా విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు నకిలీ విత్తనాలు కట్టబెట్టి, నట్టేట ముంచేందుకు యత్నిస్తున్నారు. జిల్లాలో గత ఏడాది నకిలీ విత్తనాలు విక్రయిస్తుండగా ఐదు కేసుల్లో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. తాజాగా ఈ నెల 10న జిల్లాలోని నర్వ మండలం లంకాల గ్రామ శివారులో వ్యవసాయ శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఐదు సంచుల్లో ఉంచిన రెండు క్వింటాళ్ల నకిలీ లూజ్ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

**ఏటా పెరుగుతున్న పత్తి సాగు**

జిల్లా వ్యాప్తంగా పత్తి సాగు ఏటా పెరుగుతోంది. గత ఏడాది వానాకాలంలో 1,52,994 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. వచ్చే వానాకాలంలో 1,70,000 ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

కర్ణాటక సరిహద్దులో ఉన్న జిల్లా రైతాంగం విత్తనాల కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ కలిగిన విత్తన కేంద్రాలు 245 ఉన్నాయి. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఆ డీలర్ల దగ్గరే విత్తనాలను కొనుగోలు చేయాలి. నిర్ణీత ఫార్మాట్‌లో దుకాణదారుడి అడ్రస్, పేరు, లైసెన్స్ నంబర్, జీఎస్‌టీ నంబర్ ఉన్న బిల్లును మాత్రమే అంగీకరించాలి. బిల్లుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, లాట్ నంబర్, గడువు తేదీ, డీలర్ సంతకం తప్పనిసారిగా ఉండేలా చూసుకోవాలి. గ్రామాల్లో రాత్రికి రాత్రే వచ్చి విక్రయించే నకిలీ విక్రయాదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయొద్దు. పగిలిపోయిన పాకెట్లు, డబ్బాల్లో ఉన్న విత్తనాలు, గడువు దాటిన విత్తనాలను కూడా ఎట్టిపరిస్థితుల్లో కొనొద్దు. విత్తన ప్యాకెట్, డబ్బాలపై సీల్ ఉందా లేదా చూసుకోవాలి. వాటిపై ముద్రించిన సమాచారాన్ని, బిల్లులో ఉన్న సమాచారాన్ని సరి చూసుకోవాలి. బీటీ కాటన్ విత్తన పాకెట్లపై జీఈఏసీ అప్రూవల్ నంబర్, తేదీ, సదరన్ జోన్, తెలంగాణ రాష్ట్రంలో సాగుకు అనువైనదో కాదో చూడాలి. బిల్లును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలి. దాంతో జన్యు స్వచ్ఛత లోపాలు, లేదంటే మొలక శాతం తక్కువ వచ్చినప్పుడు పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుంది. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు ఈ జాగ్రత్తలను పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ సూచిస్తున్నారు.



నకిలీ లూజు పత్తి విత్తనాలు

## పాలమూరులో.. ఫుట్‌బాల్‌కు పూర్వవైభవం



ఫుట్‌బాల్‌తో క్రీడాకారుడు

- ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
- ఉత్సాహంగా ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ

8

# శిథిలాల తొలగింపు

- నేటి ఉదయానికి 15 మీటర్ల వరకు..
- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- 51 రోజులుగా కార్మికుల కోసం అన్వేషణ
- మరో వారం రోజుల్లో శిథిలాల తొలగింపు పూర్తయ్యే అవకాశం



హైడ్రాలిక్ పవర్ కట్టర్‌తో టీబీఎం మిషన్ కంప్రెషర్ శిథిలాలను కత్తిరిస్తున్న రెస్క్యూ సిబ్బంది

దోమలపెంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో (టన్నెల్) సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రమాద ఘటనకు 50 రోజులు కావడంతో రెస్క్యూ బృందాల అధికారులతో సమీక్షించారు. సొరంగంలో పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం నుంచి కన్వేయర్ బెల్ట్ పొడిగింపు పనులు కావడంతో, శిథిలాల తవ్వకాలు చేపడుతూ టీబీఎం మిషన్ శకలాల తొలగింపు పనుల్లో కార్మికులు నిమగ్నమయ్యారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి గుర్తించి బయటకు తీసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేపడుతూ పనులు కొనసాగిస్తున్నామని, ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో రెస్క్యూ బృందాలు విధుల్లో ఉన్నట్లు ప్రత్యేకాధికారి తెలిపారు. సహాయక చర్యలో ఆర్మీ అధికారులతో పాటు, సింగరేణి జీఎండీ భైద్య, రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా, రైల్వే అధికారి రవీంద్రనాథ్, ఇరిగేషన్, జేపీ కంపెనీ ప్రాజెక్టు సీనియర్ ఇంజనీర్ సంజయ్‌కుమార్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.

**బురద మట్టి తరలింపు ప్రారంభం**

ప్రస్తుతం శిథిలాల తొలగింపు పనుల్లో 13.730 కిలోమీటర్ల నుంచి 13.800 కిలోమీటర్ వరకు కన్వేయర్ బెల్ట్ పొడిగింపునకు రెస్క్యూ బృందాలు నాలుగు రోజులు శ్రమించి పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. కాగా శుక్రవారం నుంచే మట్టి బురద బయటకు తరలించే క్రమంలో మరలా కన్వేయర్ బెల్ట్ జాయింట్ ఊడి పోవడంతో శనివారం ఉదయం వరకు బెల్ట్ జాయింటింగ్ పనులతో పాటు అరిగి పోయిన కొన్ని బెరింగ్లను మార్చడంతో పనుల్లో ఆలస్యమైంది. బండరాళ్ల వెలికితీత, టీబీఎం మిషన్ ప్లాట్ ఫామ్‌కు సంబంధించిన ఇనుప శకలాలను ప్లాస్మా, గ్యాస్, హైడ్రాలిక్ కట్టర్లతో వ్యర్థాలను కత్తిరించుకుంటు రెస్క్యూ బృందాలు పనులు కొనసాగిస్తున్నారు. 70 మీటర్ల వరకు ఉన్న శిథిలాలలో శనివారం రెండో షిఫ్ట్ నుంచి తవ్వకాలు చేపడుతున్నారు. ఆదివారం మొదటి షిఫ్ట్ బృందం వచ్చే వరకు 15 మీటర్ల శిథిలాలను తొలగించనున్నట్లు రెస్క్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఇదే స్థాయిలో పనులు కొనసాగితే వారం రోజుల్లో శిథిలాలను పూర్తిగా తొలగించడం జరుతుందని రెస్క్యూ బృందాల వారు చెబుతున్నారు.

# హజ్‌యాత్రికులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ అప్జల్ బియాబాని
- హజ్‌యాత్రీకులకు మెగా డిజిటల్ శిక్షణ




హజ్ డైరీలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అప్జల్ బియాబాని, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, సొసైటీ సూచనలు, సలహాలు పాటించాలని హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సయ్యద్ గులాం అప్జల్ బియాబాని అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అప్పన్నపల్లిలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా హజ్ యాత్రికులకు మెగా డిజిటల్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. హజ్‌యాత్రలో ఎక్కువ నడవాల్సి వస్తుందని, ఈ సమయంలో ఎక్కువ నడిచేందుకు ప్రయత్నం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హజ్ హౌస్, ఉర్దూ ఘర్ నిర్మాణానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర కమిటీ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. హజ్‌యాత్రకు అవకాశం రావటం అదృష్టమని, జిల్లా, రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని కోరారు. జిల్లా హజ్ సొసైటీ రూపొందించిన యాత్ర గైడ్‌లను ఆవిష్కరించారు. ఢిల్లీకి చెందిన చీఫ్ ట్రైనర్ మోనిస్‌ఖాన్ డిజిటల్ శిక్షణ నిర్వహించారు. మౌలానా తస్లీం అన్సారి, ముఫ్తి ఆసిఫ్, ఖలీల్ అహ్మద్ యాత్రకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్‌అలీ, మహ్మద్ మొహరాజుద్దీన్, రఫూఫ్‌పాష, సత్తార్, సులేమాన్, యూసుఫ్, సుల్తాన్, ఫైజొద్దీన్, రఫీక్, సయ్యద్ నిజాముద్దీన్, ఇలియాజ్, అహ్మద్, మహ్మద్ అర్షద్‌అలీ, హజ్‌యాత్రికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో చేర్పించండమ్మా..

**'ఉపాధి' కూలీలకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు**



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

చారకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తే ఉన్నతంగా తీర్చిదిద్దుతామని, అన్ని సౌకర్యాలతో ఉచితంగా చదువు చెప్తామని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధి హామీ కూలీలకు పనిచేసే చోటుకు వెళ్లి అవగాహన కల్పించారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి జీహెచ్‌ఎం భగవాన్‌రెడ్డి ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారికి ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మధ్యాహ్నం భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమలాకర్‌రావు, రాజేందర్ రెడ్డి, రామకృష్ణ, రామభిక్షమయ్య, డాక్యనాయక్ పాల్గొన్నారు.

# ఎట్టకేలకు పనులు షురూ..



మినీట్యాంక్ బండ్ వద్ద కేబుల్ బ్రిడ్జి

● మినీట్యాంక్ బండ్ అభివృద్ధికి ముడా నిధులు

- మొదట లైటింగ్ పనులకు టెండర్
- లైటింగ్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- రెండు నెలల్లో అందుబాటులోకి: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో రూ.కోట్లు వెచ్చించి మధ్యలోనే నిలిచిపోయిన పనులతో ట్యాంక్‌బండ్ కళతప్పింది. సందర్శకులు, వాకర్స్ సంఖ్య కూడా తగ్గుతూ రావడం.. చివరకు లైటింగ్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వాహనదారులతోపాటు పర్యాటకులను ఆకర్షించే మినీట్యాంక్‌బండ్ పనులకు ఎట్టకేలకు పున:ప్రారంభించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకుని ముడా నిధులు కేటాయించారు.

**ఆశించిన ఫలితాలు రాలే..**

ఇప్పటికే ముళ్ల పొదలు, మురికి కూపంలా ఉన్న పెద్ద చెరువును రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చే పట్టారు. చెరువును విస్తరించడంతో పాటు చుట్టూ నెక్లెస్ రోడ్డుగా మార్చారు. చెరువుపై సస్పెన్షన్ బ్రిడ్జి, ఐల్యాండ్ పనులు చేపట్టారు. సందర్శకులను ఆకర్షించేందుకు ఫొటోషూట్‌లకు పలు నిర్మాణాలు చేపట్టారు. బోటింగ్ ఏర్పాటు చేసినా గుర్రపుడెక్క తొలగింపు సమస్యగా మారింది. చెరువులోకి వచ్చే నీటిని నేరుగా అలుగుల ద్వారా దిగువన ఉన్న కాలనీలకు మళ్లించి ఒండ్రుమట్టి తరలించే కార్యక్రమం చేపట్టినా గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం సక్సెస్ కాలేదు. ఇందుకోసం ఎన్నో ప్రయత్నాలు చేసి రూ.కోట్లు వెచ్చించినా ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు.



సందర్శకులను ఆకట్టుకునేలా నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

**రూ.2 కోట్లతో అభివృద్ధి**

మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన రూ.2కోట్ల నిధులు మినీట్యాంక్‌బండ్ అభివృద్ధి కోసం కేటాయించారు. ముందుగా రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులకు టెండర్లు వేయగా ఇటీవల ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. రామయ్యబౌళి నుంచి టీకే రెడ్డికాలనీ వైపు ఉన్న రహదారి దాదాపు కిలోమీటర్ మేర సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైట్లు వేయనున్నారు. దీని తర్వాత మరో రూ.కోటిన్నర నిధులు వెచ్చించి నడకదారి, సైక్లింగ్, గ్రీనరీ పనులు చేపట్టనున్నారు. రెండు నెలల్లోనే ఈ పనులన్నీ పూర్తి చేస్తామని చెప్పడంతో మినీట్యాంక్ బండ్‌పై త్వరలోనే సందర్శకులు సందడి చేయనున్నారు. ముఖ్యంగా ప్రతీ రోజు వందల సంఖ్యలో వాకింగ్‌కు వస్తున్నారు. ట్యాంక్‌బండ్ చుట్టూ ఒక రౌండ్ వేస్తే 4 కి.మీ. అవుతుంది. వాకర్స్ ఒకటి, రెండు రౌండ్లు వేసినా సరిపోతుంది.

### రెండు నెలల్లో అందుబాటులోకి



మినీట్యాంక్‌బండ్‌ను రూ.2కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తాం. గ్రీనరీ, సైకిల్‌ట్రాక్, వాకింగ్‌ట్రాక్‌లను ఏర్పాటు చేస్తాం. మినీట్యాంక్‌బండ్‌ను ప్రజలకు విజిటింగ్ స్పాట్‌గా మారుస్తాం. ముందుగా రూ.50 లక్షలతో లైటింగ్ పనులు చేపట్టి తొందరలోనే, రూ.కోటిన్నరతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం.

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

### సందర్శకులు సందడి చేసేలా



మినీ ట్యాంక్‌బండ్ అభివృద్ధి కోసం ముడా నిధులు కేటాయించాం. రూ.50 లక్షల పనులకు ఇప్పటికే టెండర్ పూర్తయ్యింది. మినీట్యాంక్‌బండ్‌పై లైట్లు లేక రాత్రి వేళ వాహనదారులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ముందు లైటింగ్ పనులు చేపడుతున్నాం. సందర్శకులు సందడి చేసేలా అవసరమైన అన్ని పనులు చేపడతాం.

- లక్ష్మణ్‌యాదవ్, ముడా చైర్మన్

### లైటింగ్ లేకపోవడంతో..

ప్రస్తుతం ట్యాంక్‌బండ్‌పై లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళ వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగు కిలో మీటర్ల మేర ఉన్న రహదారిపై మద్యం తాగేందుకు, గంజాయి బాబులు అడ్డాగా మారిందని విమర్శలున్నాయి. రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న మినీ ట్యాంక్‌బండ్‌పై రాత్రి వేళ పెట్రోలింగ్‌ను పెంచాల్సిన అవసరం ఉంది.

# ఉద్రిక్తతకు దారితీసిన ఆందోళన

- భర్తను చంపిన వారిని అరెస్ట్ చేయాలంటూ భార్య రాస్తారోకో
- ఆసుపత్రి ఆవరణలో ఉద్రిక్త వాతావరణం



రోడ్డుపై రాస్తా రోకో చేస్తున్న మృతుని భార్య, పలువురు మహిళలు

గద్వాల క్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ మండల కేంద్రానికి చెందిన యువకుడు రామకృష్ణ మృతితో గద్వాల జిల్లా ఆసుపత్రితో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకొంది. నా భర్త మృతి చెంది రెండు రోజులైనా కారణమైన వారిని అరెస్ట్ చేయకపోవడంతో పోలీసుల వైఖరికి నిరసనగా తాను ఆత్మహత్యాయత్నం చేసుకోవడంతో పాటు పోలీసులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ రోడ్డుపై కూర్చున్నారు. ఈ సంఘటన గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని మల్దకల్ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణ(25) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే తన భర్త మృతికి గద్వాలకు చెందిన ట్రాన్స్‌జెండర్ శివానితో పాటు మరో ముగ్గురు కలిసి తన భర్తను హత్య చేశారని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని శుక్రవారం నుంచి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుని భార్య కృష్ణవేణితో పాటు బంధువులు కర్నాకర్, రామాంజనేయులు, మరికొందరు ఆందోళన చేస్తున్నారు. అంతేకాక మృతికి కారణమైన వారిని అరెస్ట్ చేయడంతో పాటు తమకు న్యాయం జరిగేలా చూడాలని అంతదాకా పోస్టుమార్టం చేయనీయమని భీష్మించుకొని కూర్చున్నారు. అయితే పోలీసులు వారిని వెతికే క్రమంలో ఉన్నామని చెప్పడంతో వారు ఒప్పుకున్నారు. అయితే రామకృష్ణను చంపిన వారిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మండిపడుతూ శనివారం వారు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తన భర్త మృతికి కారణమైన వారిని ఎందుకు పట్టుకోవడంలేదంటూ కృష్ణవేణితో పాటు బంధువులు పోలీసులపై మండిపడ్డారు. త్వరలోనే పట్టుకుంటామన్నా వినకుండా పోలీసులతో వాగ్వాదం చేస్తూనే తన పిల్లలతో సహా పోలీసుల ఎదుటే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అంతటితో ఆగకుండా పోలీసులు ఇంకా నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ, తమకు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదంటూ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెట్రోల్ బాటిల్‌తో పాటు తన చంటిబిడ్డలతో, బంధువులతో రోడ్డుపై కూర్చొని బైటాయించారు. రోడ్డుపై ధర్నాను విరమించాలని పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్‌ఐ నందికర్‌తో పాటు పోలీస్ సిబ్బంది వారిస్తున్నా వారు అలాగే కూర్చున్నారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రి ఆవరణలో, రోడ్డుపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ధర్నా చేసేందుకు ప్రయత్నిస్తుండగా పట్టణ, రూరల్ ఎస్‌ఐలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బాధితులకు మధ్య తోపులాట చోటు చేసుకొంది. రోడ్డుపై ధర్నా చేస్తున్న సంఘటన స్థలానికి సీఐ టంగుటూరి శ్రీను హాజరై పోలీసులకు సహకరించాలని, మీకు న్యాయం జరిగేలా చూస్తానని, మరో రెండు రోజుల్లో అనుమానితులను అరెస్ట్ చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించి పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించారు.

# మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే కుట్ర

- పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ భూమయ్య




మాట్లాడుతున్న ప్రొఫెసర్ భూమయ్య

పాలమూరు, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): దేశంలో మనువాద రాజ్యాంగాన్ని తీసుకొచ్చే కుట్ర జరుగుతుందని పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ భూమయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి బాలుర హస్టల్‌లో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అంశంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి ఉన్నప్పుడే రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర చేస్తే తీవ్ర వ్యతిరేకత రావటంతో విరమించుకున్నారని గుర్తుచేశారు. దేశమంతటా రిజర్వేషన్లకు తూట్లు పొడిచి తీసివేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్రం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ తీసుకురావటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగ అవకాశాలు రాలేకపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్-14 ప్రకారం చట్టం అందరూ సమానమని చెబుతోందన్నారు. బీజేపీ నేతలు మహిళలు వంటింటికే పరిమితం చేయాలంటున్నారని అన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం.మాణిక్యం రాజు, యం.కుర్మయ్య, వార్డెన్ డా.కృష్ణమోహన్, బత్తినిరాము క్రాంతి, విల్సన్, సతీష్, రామరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# పాలమూరులో ఫుట్‌బాల్ పూర్వవైభవం

- ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
- ఉత్సాహంగా ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్పీ.వెంకటేశ్, రంగారావు, రాయల రమేష్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫుట్‌బాల్‌కు పూర్వవైభవం కోసం కృషి చేస్తామని ఫుట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక స్టేడియం మైదానంలో 'బ్యాక్‌టూ 20వ సెంచరీ' పేరిట ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. ఇందులో విశాఖపట్నం, నెల్లూరు, ఏపీ క్రీడా పాఠశాల పూర్వ విద్యార్థుల జట్టుతో పాటు మహబూబ్‌న గర్ సీనియర్ క్రీడాకారులు జట్టు పాల్గొంది. పోటీలను జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీనియర్ క్రీడాకారులు చూసి వర్తమాన క్రీడాకారులు నేర్చుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, రంగారావు, రాయల రమేష్, ప్రసన్నకుమార్, గజానంద్, రామకృష్ణ, శశిధర్, రాజశేఖర్, నగేశ్, రవీందర్, మురారి పాల్గొన్నారు.

**మొదటి రోజు ఫలితాలు**

టోర్నీ మొదటి రోజు ఉత్సాహంగా కొనసాగింది. మొదటి మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు 4-2 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ సీనియర్ జట్టుపై గెలిచింది. నెల్లూరు జట్టు 1-0 గోల్స్‌తేడాతో ఏపీ స్పోర్ట్స్ స్కూల్‌పై, విశాఖపట్నం జట్టు 1-0 గోల్స్ తేడాతో ఏపీ స్పోర్ట్స్ స్కూల్స్‌పై, నెల్లూరు జట్టు 3-1తో మహబూబ్‌నగర్‌పై గెలిచాయి.

# విద్యతోనే.. మార్పు



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

(7వ పేజీ తరువాయి)

పరిశుభ్రత, నిపుణులైన అధ్యాపకులతో విద్యాబోధన జరిగేలా చూస్తున్నాను. పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఉంటే తక్షణం భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాను. వచ్చే విద్యా సంవత్సరం నాటికి వంద శాతం ఫలితాలు సాధిస్తామని ప్రగాఢమైన విశ్వాసం ఉంది.

**ప్రభుత్వ పాఠశాలల్లో గతంలో ప్రారంభించిన పనులు పూర్తి కాలేదా?**

అలాంటిదేమి లేదు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద జిల్లాలోని దాదాపు 700పైచిలుకు ప్రభుత్వ బడులకు లక్ష రూపాయల చొప్పున కేటాయించాం. రక్షిత మంచినీరు, మరుగుదొడ్లు, బెంచీలు, టేబుళ్ల కోసం ఈ నిధులను వెచ్చించాం. ఇంకేమైనా వసతులు మెరుగుపర్చాల్సి ఉంటే విద్యాభిమానుల సలహాలు, సూచనలు స్వీకరిస్తాం.

**చెంచుల నిధులు పక్కదారి పడుతున్నాయా?**

అలాంటి సంఘటనలు ఎక్కడ చోటు చేసుకున్నా అందుకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. గిరిజన కార్పొరేషన్‌లో అవినీతి జరిగినట్లు వార్తలు వచ్చిన వెంటనే రాష్ట్ర స్థాయి అధికారులతో విచారణ జరిపించాం. ఆ నివేదిక వచ్చిన వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయి.

**కార్మికుల ఆచూకీ దొరికే వరకు రెస్క్యూ ఆపరేషన్**

శ్రీశైలం ఎడమగట్టు సొరంగంలో కార్మికుల ఆచూకీ దొరికే వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది. దేశంలో రెస్క్యూ ఆపరేషన్‌లో నిపుణులైన 18ఏజెన్సీలకు సం బంధించిన నిపుణులతో రెస్క్యూ ఆపరేషన్ నిర్విరామంగా కొనసాగుతుంది. ఇప్పటికీ ఇద్దరి ఆచూకీని కనుగొన్నాం. అనేక అవాంతరాలు ఎదరవుతున్నా ఒక్కో అడుగు ముందుకేస్తూ కార్మికుల జాడను కనుగొనేందు కు చేస్తున్న ప్రయత్నాలకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరం.

### వైద్యపరంగా సేవలను జిల్లాలో ఎలా విస్తృతం చేయనున్నారు.?

గ్రామస్థాయి నుంచి వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీలల్లో ఏఎన్‌ఎంలు రెగ్యులర్‌గా వచ్చేలా మానిటరింగ్ చేస్తున్నాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే దిశగా వేస్తున్న అడుగులు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లా ఆసుపత్రి మెడికల్ కళాశాలలోకి మారిన తర్వాత దీనిని మెటర్నిటీ సెంటర్‌గా ఆధునికీకరించాలని నిర్ణయించాం. క్షయ వ్యాధి నిర్మూలనపై పెట్టిన ప్రత్యేక శ్రద్ధ తెలంగాణలో నాగర్‌కర్నూల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చి పెట్టింది. టీబీ నిర్ధారణ కోసం మొబైల్ ఎక్స్‌రేను ఏర్పాటు చేయడంతోపాటు రోగులకు అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లు సత్ఫలితాలనిస్తున్నాయి. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు ఉదయం 11గంటల లోపు ఉపాధి పనులు చేపటాలని ఆ తర్వాత 3 నుంచి 5గంటల లోపు ముగించాలని ఆదేశించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్ల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఎప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని హీట్‌వేవ్ మందులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూడా మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు బయటకు తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### చెంచుల సంక్షేమంపై మీకున్న ప్రణాళిక ఏమిటీ?

చెంచులు కూడా విద్యా వ్యవస్థకు దూరంగా ఉన్న కారణంగానే అభివృద్ధి చెందలేకపోయారనేది నా భావన. పెద్దూటి, అప్పాపూర్‌లో ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి అడవి బిడ్డల పిల్లలకు విద్యాబుద్దులు నేర్పించేందుకు ప్రయత్నించిన ఆ దిశగా చెంచు కుటుంబాలను చైతన్యవంతం చేయలేకపోయాం. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా దృష్టి సారించాను. అప్పాపూర్ ఆశ్రమ పాఠశాలలో కమిట్‌మెంట్‌తో పని చేసే ఉపాధ్యాయులను నియమించాం. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు మారిపోయాయి. విద్యా ఆవశ్యకతను చెంచు కుటుంబాలకు వివరించడం వల్ల వారిలో తమ పిల్లలను చదివించాలనే తాపత్రయం బాగా పెరిగింది. త్వరలోనే సానుకూలమైన ఫలితాలు వస్తాయి. అడవి ప్రాంతాన్ని వదిలి మైదాన ప్రాంతాలకు రావాలనుకుంటున్న చెంచులకు సకల సౌకర్యాలతో పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందు కోసం పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద పునరావాసాన్ని కల్పించేందుకు స్థలాన్ని ఎంపిక చేశాం. వారి పూర్తి సానుకూలతతో ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం.

### పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల భూసేకరణ పనులు..?

గతంలో ఎలాంటి సాగునీటి వనరులు లేని నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తి ఎత్తిపోతల, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు వ్యవసాయానికి జీవనాడిగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో వ్యవసాయ రంగం గాడిన పడింది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తైతే మరో లక్ష ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి రూపొందించాల్సిన కార్యాచరణను ప్రతీ వారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్నాం. ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటి వారం వరకు భూసేకరణ ప్రక్రియ అంతా పూర్తి చేస్తామనే నమ్మకం ఉంది.

క్రైం కార్నర్

## దేవరగుట్టలో చిరుతల సంచారం

▸▸ పాదముద్రలు సేకరించిన అధికారులు



దేవరగుట్ట వద్ద పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, రైతులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్ల దేవరగుట్టలో చిరుతల సంచారం నిమజని అటవీశాఖ అధికారి రమేశ్ తెలిపారు. శనివారం గ్రామ రైతులతో కలిసి గుట్టను సందర్శించి చిరుతల పాదముద్రలు సేకరించారు. కాగా శుక్రవారం సాయంత్రం గుట్టలోని గంజిబొంద వద్ద రెండు చిరుతలు కనిపించినట్లు రైతులు తెలిపారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారి మాట్లాడుతూ రైతులు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. తాము రాత్రి, పగలు తిరుగుతామని, చిరుతలు సంచరించే ప్రాంతాల్లో బోన్లు ఏర్పాటు చేయాలని రైతులు చెలిమె ఆంజనేయులు, రామస్వామి, అంజయ్య కోరారు. అయితే చిరుతలు సేఫ్ జోన్‌గా దేవరగుట్టను ఎంచుకున్నట్లు తెలుస్తుంది. శనివారం సాయంత్రం మరోసారి చిరుత బయటకు వచ్చి రైతులకు కనపడటంతో ఆందోళన చెందారు.

## హెచ్‌టీ వైర్లు తాకి డీసీఎం దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న డీసీఎం

గట్టు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం వాహనానికి హెచ్‌టీ లైన్ వైర్లు తాకి దగ్ధమైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని లింగాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. లింగాపురం గ్రామంలోని రైతు నారాయణ పొలంలో బొప్పాయి పండ్లను డీసీఎంలో నింపి తీసుకెళ్తుండగా పొలంలో ఉన్న హెచ్‌టీ వైర్ల డీసీఎంకు తాకాయి. మంటలు డీజిల్ ట్యాంకు వరకు వ్యాపించడంతో వాహనంతోపాటు పండ్లు మొత్తం మంటల్లో కాలిపోయాయి. డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కొద్దిసేపటికి ఫైర్ ఇంజన్ చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే మంటల్లో పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ వైర్లు కిందకు ఉండటంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

## వ్యక్తిపై దాడి, కేసు నమోదు

కేటీదొడ్డి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ముందు నుంచి బహిరంగ మలమూత్ర విసర్జనకు వెళ్లకూడదంటూ ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఈర్లబండ గ్రామంలో అదే గ్రామానికి చెందిన రాముడును మద్దెల వెంకటన్న, మద్దెల వీరన్న, మద్దెల రంగన్న, మద్దెల నాగరాజు, మద్దెల మాణిక్యమ్మ దాడి చేశారు. కాగా తమ ఇంటి ముందు నుంచి వెళ్తే ఇంటి ఆవరణ అపరిశుభ్రమవుతుందని చెప్పి మూకుమ్మడిగా కట్టెలు, రాళ్లతో దాడి చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఈత నేర్పించేందుకు వెళ్లి..
## చెరువు బురదలో ఇరుక్కొని వ్యక్తి మృతి

గోపాల్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఈత నేర్పించడానికి వెళ్లి బురదలో ఇరుక్కుని వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్‌కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీశైలం (41), భార్య ఏర్పుల మంగమ్మ ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ గ్రామంలో జీవనం కొనసాగిస్తున్నారు. ఇద్దరు కుమారులు శివ గణేష్, శివ కార్తీక్‌కు మధ్యాహ్నం ఈత నేర్పించేందుకు భార్య, భర్త గ్రామ పరిధిలో ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. భార్య కుమారులకు ప్లాస్టిక్ క్యాన్లు కడుతున్న సమయంలో శ్రీశైలం చెరువులోకి దూకాడు. శ్రీశైలం బురదలో ఇరుక్కుని పైకి రాలేకపోయాడు. భార్య కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి చెరువులో వెతికినా ఫలితం లేకుండా పోయింది. సాయంత్రం 5 గంటల సమయంలో శ్రీశైలం మృతదేహం లభించింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# అభివృద్ధి పనులపై ఇంత నిర్లక్ష్యమా?

▸▸ అధికారుల తీరుపై నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఆగ్రహం

▸▸ సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో పనులను పరిశీలించిన కలెక్టర్ బదావత్ సంతోష్



మిషన్ భగీరథ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించే ప్రసక్తే లేదని, పురోగతి లేకుంటే చర్యలు తప్పవని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తీవ్రంగా హెచ్చరించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ భవనంలో పనులపై ఆయా శాఖ అధికారులతో సమీక్షించారు. నాలుగు లైన్ల రహదారి పనులను వేగవంతం చేయలని సూచించారు. పాల శీతలీకరణ కేంద్రం భవనం పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామంలో వీధిలైట్లకు స్తంభాలను పాతాలని తెలిపారు. మిషన్ భగీరథ పైపులైన్ల టెండర్ విషయంలో అధికారుల నిర్లక్ష్యం వహించడంతో కలెక్టర్ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో వంద శాతం సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రెడ్కో అధికారులకు తెలిపారు. గ్రామంలో చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్‌కు స్థలాన్ని ఎంపిక చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి మే నెల ఆఖరునాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ఇళ్లను కోల్పోతున్న వారితో కలెక్టర్ మాట్లాడారు. నష్టపోతున్న ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. మధ్యాహ్నం నాగసూలు లక్ష్మమ్మ ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్న బియ్యంతో చేసిన భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు, అధికారులతో కలిసి కలెక్టర్ తిన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన సన్న బియ్యం పథకం పేదవారికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి విజయ్‌కుకుమార్, డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్అండ్‌బీ డీఈ నాగలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ పాల్‌రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, తహసీల్దార్‌మురళీమోహన్, ఎంపీడీవో బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 14 ఏళ్ల బాలుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం చేస్తున్న సభ్యులు



వెన్నెముక సమస్యతో బాధపడుతున్న చిన్నారికి నగదు అందజేస్తున్న సభ్యులు

# ‘సోషల్’ భరోసా

▸▸ బాధితులకు అండగా ఉంటున్న సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం

▸▸ ఆరేళ్లుగా రూ.40 లక్షలకు పైగా 130 కుటుంబాలకు ఆర్థిక సాయం

గద్వాల సర్కిల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ ఉద్యోగులు కొందరు తమకొచ్చే జీతంలో పొదుపు చేస్తూ.. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న వారికి సాయం చేసేందుకు సోషల్ రెస్పాన్సిబిలిటీ సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. అత్యవసర, అనారోగ్యంతో, అనాథలుగా కాలం వెల్లదీస్తున్న వారికి తామున్నామంటూ ఆపన్న హస్తాలతో ఆదుకుంటున్నారు. పలు సామాజిక మాధ్యమాల ద్వారా సమస్యలను, కష్టాలను గుర్తించి ఆర్థికంగా ఆదుకుంటూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆరేళ్లుగా రూ.40 లక్షలకు పైగా 130 కుటుంబాలకు అందించిన గద్వాలలోని సోషల్ రెస్పాన్సిబిలిటీ సేవలపై ‘ఆంధ్రజ్యోతి’ ప్రత్యేక కథనం.

### రిటైర్డ్ ఉద్యోగి సేవల స్ఫూర్తితో..

హైదరాబాద్‌కు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి తనకొచ్చిన పెన్షన్‌లో కొంత మేర నిరుపేదలకు ఆర్థికంగా ఆదుకునేందుకు వెచ్చిస్తున్న విషయాన్ని సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకున్న గద్వాలకు చెందిన కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తెలుసుకున్నారు. స్ఫూర్తిగా తీసుకుని 2019 మార్చి 21న సోషల్ రెస్పాన్సిబిలిటీ పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. స్థాపించిన ఆరేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరుపేదలను ఆర్థికంగా ఆదుకుంటూ సామాజిక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. నెల జీతంలో కొంత మేర సామాజిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఏ సమయంలో ఏ ఆపద వచ్చినా...క్లిష్టపరిస్థితులు ఎదురైన ఆదుకునేందుకు తామున్నామంటూ సామాజిక సేవలో నిమగ్నమైన ఈ సభ్యులు వ్యాపారస్తులను, ప్రైవేట్ ఉద్యోగులను తమ సంస్థలో భాగస్వాములుగా చేసుకుని నిరంతర సేవలు అందిస్తున్నారు. లాక్‌డౌన్, వరదల సమయంలో సభ్యులు అందించిన సేవలను ఉన్నతాధికారులు గుర్తించి ప్రత్యేకంగా అభినందించారు.

### సామాజిక బాధ్యతతో అందించిన సేవల్లో కొన్ని..

- ఈ నెల 5న నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మదిగట్లపేటకు చెందిన స్వాతి, వెంకటేష్ దంపతుల ఎనిమిది నెలల బాబు వెన్నుముక సమస్యకు గురై ఐసీయూలో చికిత్సపొందుతున్నట్టు సమాచారం తెలుసుకుని వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 53,250 ఆర్థిక సాయం అందజేశారు.
- మార్చి 9న గద్వాలకు చెందిన బాలుడు గౌతం బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడంటూ తమ సభ్యులకు కొందరి యువకుల ద్వారా సహాయం చేయలంటూ తెలిపారు. వెంటనే స్పందించి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి రూ. 52,800 నగదు అందించారు.
- ఫిబ్రవరి 11న ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న గద్వాల మండలం బీరెల్లి గ్రామానికి చెందిన మద్దిలేటికి చికిత్స నిమిత్తం రూ.37,421 నగదు చేశారు.
- మల్దకల్ మండలంలోని పాల్వాయి గ్రామానికి చెందిన దేశన్న కుటుంబం ఆర్థిక కష్టాలతో బాధపడుతున్నట్టు గుర్తించి రూ. 45 వేల నగదుతో పాటు రూ. 5 విలువ గల నిత్యావసర సరుకులు అందించారు.
- గతేడాది అక్టోబర్‌లో పక్షపాతంతో కుటుంబ పోషణకు దూరమైన కార్పెంటర్ వీరాంజనేయులుకు రూ.39,500 అందించి బాసటగా నిలిచారు.
- గద్వాల మండలం అనంతపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు తెలుసుకుని రూ. 42 వేలు అందజేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం చెంచుపేటలో 38 కుటుంబాలకు రూ. 1.50 లక్షల విలువ గల వంట సామగ్రి, నిత్యావసర సరుకులు అందజేశారు.
- గద్వాల ప్రభుత్వాస్పత్రిలో 20 మంది టీబీ బాధితులకు రూ. 60వేల విలువ గల పౌష్టికాహార పదార్థాలతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.
- గద్వాల శివారు దౌదర్‌పల్లికి చెందిన ఓ చిన్నారి కండరాల క్షీణతతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్టు తెలుసుకుని రూ. 40 వేల విలువ గల ఆక్సీజన్ కాన్సెన్‌ట్రేటర్‌ను అందించారు.

### గొప్పగా భావిస్తున్నా..



సోషల్ రెస్పాన్సిబిలిటీ టీంలో సభ్యునిగా ఉంటూ సామాజిక సేవలో పాలుపంచుకోవడం గొప్పగా భావిస్తున్నాను. నెల జీతంతో కొంత డబ్బు పొదుపు చేస్తూ ఆర్థిక సహాయం చేయడం, ఇతర సామాజిక కార్యక్రమాలకు ఉపయోగించడం సంతోషాన్నిస్తోంది. సహాయం కోసం సంప్రదిస్తే విచారణ చేసుకుని ఆదుకుంటాం.

\- సంధ్యాఅశోక్,
సీనియర్ అసిస్టెంట్, విద్యుత్ శాఖ, గద్వాల

### ఆదుకోవడంలో అనుభూతి...



సామాజిక సేవ ద్వారా నిరుపేదలను ఆర్థికంగా ఆదుకోవడంలో కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేం. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు వ్యాపారస్తులు కూడా సంస్థలో సభ్యులుగా చేరడం అభినందనీయం.

\- కోట్ల శ్యాంసుందర్, ఎన్సీడీ కో ఆర్డినేటర్,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, గద్వాల

# పోటెత్తారు

లింగమయ్యా..
వస్తున్నామంటూ భక్తుల సాహస యాత్ర



లింగమయ్య దర్శనానికి కర్రల సాయంతో వెళ్తున్న వృద్ధులు



అడవిలో గుంపులుగా వెళ్తున్న భక్తులు

(7వ పేజీ తరువాయి)

సమితి, గాజుల అంబయ్య, శామల ట్రస్ట్ శ్రీనివాస చార్టబుల్ ట్రస్ట్, గంగపుత్ర సంఘం, తదితర స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పండ్లు, ఫలహారాలతో పాటు రాగిజావ, మజ్జిగ, అన్నప్రసాదాలను అందజేశారు.

### బండరాళ్లే భక్తుల పట్టుపాన్పులు

స్వామి దర్శనం కోసం కొండ కోనలు దిగుతూ ఎక్కుతూ బండరాళ్ల నడుమ అతికష్టం మీద వస్తున్నాం లింగమయ్య అంటూ ఊతకర్ర చేతబట్టి భక్తులు సాహసయాత్రను సాగించారు. మార్గ మధ్యంలో అలసిపోయిన భక్తులు బండరాళ్ల మధ్యనే ఆదమరిచి నిద్రిస్తూ సేదతీరుతూ... మళ్లీ తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

### విస్తృత ప్రచారం

సలేశ్వర ఉత్సవాల గురించి మీడియాతో పాటు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారంతో దక్షిణ అమర్‌నాథ్ యాత్రగా పిలువబడుతున్న సలేశ్వర లింగమయ్య యాత్రకు భక్తులు, పర్యాటకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నల్లమల రహదారుల వెంట జనజాతర నెలకొన్నది. వాహనాలు బారులు తీరాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా 300మంది పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. యాత్రలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య బృందాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు.

### స్వామి దర్శనం కోసం కష్టమైనా ఇష్టంగా వెళుతున్నాం

నల్లమల అడవులలో వెలసిన సలేశ్వరుడిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయన్న నమ్మకం. స్వామి దర్శనం కోసం ఎంతటి కష్టమైనా ఇష్టంగా వెళుతున్నాం. ఈ ఏడాది భక్తులు పెద్ద ఎత్తున్న తరలిరావడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది.


\- ప్రియదర్శిని, మహబూబ్‌నగర్

### సలేశ్వర క్షేత్రం మొదటిసారి చూస్తున్నాం



మాది కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ సమీపంలోని ఎడివెళ్లి గ్రామం సలేశ్వర క్షేత్రం గురించి మీడియా ద్వారా తెలుసుకున్నాం. మొదటిసారిగా స్వామి దర్శనం కోసం వచ్చాం. అడవి ప్రాంతంలో ప్రయాణం చేస్తుంటే ఎంతో ఉత్తేజం ఉంది. స్వామి దర్శనం బాగానే అయ్యింది. ఇక్కడి నుంచి ప్రతిసారి రావాలనుకుంటున్నాం.

\- అశోక్, ఎడివెళ్లి గ్రామం, కర్ణాటక



మెట్లు దిగుతున్న భక్తులు



అన్నప్రసాదాలు వితరణ చేస్తున్న భక్తులు

### నల్లమలలో ట్రాఫిక్ జామ్

మన్ననూర్: సలేశ్వరం లింగమయ్య స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో నల్లమలలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు మన్ననూరు ప్రధాన చెక్‌పోస్టు వద్ద టోల్‌గేట్ రుసుములను వసూలు చేస్తున్న క్రమంలో 4 కిలో మీటర్ల పొడవునా కుంచోనిమూల వరకు, మన్ననూరు దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు నుంచి మన్ననూరు వరకు రెండు కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. మొదటి రోజు 5వేల వాహనాలు, శనివారం సాయంత్రానికి 6 వేలకు పైగా వాహనాలు సలేశ్వరం తరలివెళ్లాయని టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు.

### నాగర్‌కర్నూల్ డిపో నుంచి 25 బస్సులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సలేశ్వరం జాతర వెళ్లే ప్రయాణికులతో నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండు శనివారం కళకళలాడింది. నాగర్‌కర్నూల్ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. భక్తుల కోసం బస్టాండ్‌లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి సలేశ్వరం జాతరకు స్పెషల్ చార్జీ రూ.200గా నిర్ణయించారు. ఒక బస్సు రోజుకు రెండు ట్రిప్పులు నడిపించినా ప్రయాణికుల రద్దీ తగ్గలేదు. బస్టాండుకు వచ్చిన బస్సు వచ్చినట్టే ప్రయాణికులు ఎగబడి ఎక్కారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో ఐదు బస్సులను అదనంగా ఏర్పాటు చేశామని డిపో మేనేజరు యాదయ్య తెలిపారు.

## వైభవంగా ఆభరణాల ఊరేగింపు

▸▸ చింతలముని రంగస్వామి బ్రహ్మోత్సవాలకు ఆభరణాల తరలింపు



ఆత్మకూరులో చింతలముని రంగస్వామి ఆభరణాలు తరలిస్తున్న ఆలయ అధికారులు, నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామంలో జరిగే చింతల మునిరంగ స్వామి బ్రహ్మోత్సవాలకు ఆత్మకూరు నుంచి శనివారం ఆభరణాలను తరలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌బీఐలో లాకర్‌లో దాచిన ఆభరణాలకు పూజలు నిర్వహించారు. అనంతరం బ్యాంకు నుంచి గాంధీ చౌరస్తా మీదుగా వేద పండితులు భజన కీర్తనలు, మంగళ వాయిద్యాల మధ్య ఆభరణాలను తరలించారు. కార్యక్రమానికి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు గౌడ్ హాజరై పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఘనంగా జరగాలని కోరారు. కార్యక్రమంలో రాసాల రాజురెడ్డి, సత్యరెడ్డి సుధాకర్, డోకూరు రాజారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

## మల్దకల్‌లో 40.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

వనపర్తి అర్బన్/నారాయణపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం ఎండ తీవ్రత ఉన్నది.

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో 40.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ధరూర్‌లో 38.9, గద్వాల, అయిజ లలో 38.8, గట్టులో 38.7 డిగ్రీలు నమోదైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలు నమోదయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠంగా 40 డిగ్రీలు, కనిష్ఠంగా 27 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లా కొత్తకోటలో గరిష్ఠంగా 39.2 డిగ్రీలు, కనిష్ఠంగా పాన్‌గల్ మండలంలో 24.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నారాయణపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## జల వనరుల సాధన సదస్సు జయప్రదం చేయాలి

▸▸ పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ కె.రాఘవాచారి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఆదివారం నిర్వహించనున్న జల వనరుల సాధన సదస్సును జయప్రదం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ కె.రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డిండీ ఎత్తిపోతలతో పాలమూరుకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిసినా, ఏ రాజకీయ పార్టీ బాధ్యత చూపడం లేదని తెలిపారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర, పొరుగున ఏపీ రాష్ట్రాలు నీటి కోసం తీవ్ర కృషి చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రాయలసీమ, నల్గొండ జిల్లా నాయకులు జలసాధన విషయంలో తమ చేతుల్లోకి తీసుకుని పని చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అచ్చంపేటలోని టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించనున్న ఈ సదస్సుకు ఉమ్మడి జిల్లాలోని సామాజిక ఉద్యమకారులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఇంటర్వ్యూ..

### విద్యార్థుల సంఖ్య పెంచుతాం

» సంక్షేమ అధికారి ప్రవీణ్‌కుమార్ రెడ్డి



నవాబ్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల వసతి గృహాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానని సంక్షేమ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పలు విషయాలు వెల్లడించారు.

**శిథిలావస్థకు చేరిన వసతి గృహంతో ఇబ్బంది లేదా?**

చాలా ఇబ్బంది ఉంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.

**సరిపడా గదులు ఉన్నాయా?**

విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఇబ్బందులున్న మాట వాస్తవమే. మరుగుదొడ్లు సైతం ఆశించిన స్థాయిలో లేవు.

**సిబ్బంది కొరత ఉందా?**

కొంత సిబ్బంది కొరత ఉంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

**విద్యార్థులు తక్కువగా ఉన్నట్లు తెలిసింది?**

పూర్తి స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం 118 మంది విద్యార్థులు ఉన్నారు.

## న్యూస్ బాక్స్

### రామయ్య మృతి తీరని లోటు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వనజీవి రామయ్య మరణం ప్రకృతి ప్రేమికులకే కాదు యావత్ సమాజానికే తీరని లోటని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. తన ఇంటి పేరును వనజీవిగా మార్చుకొని పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ రామయ్య అన్నారు. పర్యావరణం లేనిదే మానవ మనుగడ సాధ్యంకాదని నమ్మి కోటికి పైగా మొక్కలు నాటారని కొనియాడారు.

### ధాన్యం కొనుగోలు

దేవరకద్ర, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌కు శనివారం ఆర్ఎన్ఆర్ 1498 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2201 కనిష్ఠంగా రూ.1800 పలికినట్టు మార్కెట్ కార్యదర్శి జయశ్రీ తెలిపారు. ఆముదాలు 12 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.6,050 కనిష్ఠంగా రూ.6,040, పెద్ద హంస 106 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.1769, కనిష్ఠంగా రూ.1669 పలికింది.

### 'రైతు భరోసా' అందజేయాలి

పాలమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారికి 'రైతు భరోసా'ను తక్షణమే అందజేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బుచ్చారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరికీ ఉగాది నాటికి 'రైతు భరోసా' చెల్లిస్తామని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు.

### నేడు శివాజీ విగ్రహం ఆవిష్కరణ

కోయిలకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపూర్‌లో హిందూవాహిని యువజన సంఘం ఆధ్వర్యంలో రాంపూర్ బురుజుపై ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే రాజాసింగ్, ఆదిత్య పరాశక్తి స్వామి హాజరవుతారని తెలిపారు.

### కారుకొండలో అంబేడ్కర్ విగ్రహం..

నవాబ్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కారుకొండలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు కమిటీ సభ్యులు నర్సింహులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కావలి రమేష్ శనివారం తెలిపారు. ఈ విగ్రహం ఆవిష్కరణకు ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎంపీ డీకె అరుణ హాజరవుతారని తెలిపారు.

### ఆర్థిక సాయం అందజేత

హన్వాడ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన వడ్డె భీమయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందగా, అంత్యక్రియల నిమిత్తం జడ్పీటీసీ మాజీ నరేందర్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

### మంత్రి నరసింహకు డాక్టరేట్

పాలమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నరసింహయ్య ఇంగ్లాండ్‌కు చెందిన కేంబ్రిడ్జ్ డిజిటల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 20 ఏళ్ల నుంచి ఆయన సేవలకు గుర్తింపుగా సోషల్ సర్వీసు రంగంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి శనివారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో డాక్టరేట్ ప్రదానం చేశారు.

### కొనసాగుతున్న ప్రతిష్ఠాపనోత్సవాలు

గండీడ్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలర్‌నగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా ఆదివారం విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, మండల ఆరాధన, హోమాలు, ధాన్యధివాసం, పుష్పాధివాసం, 14న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ నేత్రో నీలము దర్శనం, అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన అడ్వకేట్ శివప్ప నాగ పడగను అందించారు.





రైల్వేగేట్ వద్ద ఇళ్ల మధ్యనే నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్లాస్టిక్ సేకరణ షాపు

# స్వచ్ఛత ఏదీ?

» ఇళ్ల మధ్యనే ప్లాస్టిక్ వ్యర్థాలు

» రైల్వేగేట్ నుంచి ఎక్స్‌రోడ్ వరకు చెత్త సేకరణ కేంద్రాలు

» మునిసిపాలిటీ అనుమతి లేకున్నా యథేచ్ఛగా నిర్వహణ

పాలమూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరులో స్వచ్ఛతకు బీటలు వారుతున్నాయి. పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా మునిసిపల్ సిబ్బంది ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఊరి బయటకు తరలిస్తున్నారు. మైకులు, ఇతర ప్రచార సాధనాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు తిరుమల దేవుని గుట్ట (టీడీ గుట్ట) వార్డులో జనావాసాల మధ్యనే ప్లాస్టిక్ వ్యర్థాల కొనుగోలు కేంద్రాలు నెలకొల్పడం ఇబ్బందిగా మారింది. అక్కడ గుట్టలు, గుట్టలుగా పోగైన చెత్త రోగాలకు కారణమవుతోందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పాలమూరు అనే నినాదాలతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచటానికి ఎమ్మెల్యే, కౌన్సిల్, మునిసిపల్ అధికారులు నిత్యం కృషి చేస్తున్నారు. అయినప్పటికీ టీడీగుట్ట రైల్వేగేట్ నుంచి రెండు సడాకుల (కోయిలకొండ ఎక్స్‌రోడ్డు) వరకు రోడ్డు వెంబడి వ్యాపారులు ప్లాస్టిక్ వ్యర్థాల కొనుగోలు కేంద్రాలను విచ్చలవిడిగా ప్రారంభించారు. వీరికి మునిసిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. రైల్వేగేట్‌కు పక్కనే జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉన్నప్పటికీ చెత్తను కుప్పలుగా పోస్తున్నారు. దీంతో విద్యార్థుల ఆరోగ్యం పాడవుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊరికి దూరంగా చెత్త, పాత ఇనుప సామగ్రి కొనుగోలు కేంద్రాలు ఉండాలి. కానీ కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని వారిని పట్టించుకోవడం లేదు. కాలనీ యువకులు మాత్రం మునిసిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. చెత్తను వేరు చేయగా మిగిలిన వాటిని కాల్చే సమయంలో భరించలేని దుర్వాసన వస్తోంది. దీంతో క్యాన్సర్, టీబీ, ఇతర రోగాలు వస్తాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన చెత్తకేంద్రాలను ఊరి చివరకు తరలించాలని కోరుతున్నారు. ఈ మధ్య అటునుంచి వెళ్తున్న కలెక్టర్ ప్లాస్టిక్ సేకరణ కేంద్రాన్ని చూసి ఇదేమిటిని ప్రశ్నించారు. అయినప్పటికీ అక్కడి నుంచి కదలటం లేదని కాలనీవాసులు, యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎవ్వరు చెప్పినా వినరు..**



చాలా కాలం నుంచి ఇక్కడ చెత్త కేంద్రాన్ని నిర్వహిస్తున్న యజమాని ఖాజా ఎవరు చెప్పినా వారిని మచ్చిక చేసుకుని మరో దారిలో వ్యాపారం చేసుకోవటం ఆయన ప్రత్యేకత. రోడ్డుకు ఇటువైపు, కాదంటే అటువైపు ఇలా పది, పన్నెండు మార్లు షాపు మార్చి అక్కడే వ్యాపారం చేస్తున్నాడు.

\- శంకర్, కాలనీవాసి

**అధికారుల అండదండలు ఉన్నాయి..**



టీడీ గుట్ట ఏరియాలో చెత్త కేంద్రాలను నిర్వహించే వ్యాపారులకు పోలీసులు, పై అధికారుల అండదండలు పుష్కలంగా ఉంది. దీంతో ఊరి బయట మాత్రమే చెత్త కొనుగోలు కేంద్రాలు, ప్లాస్టిక్, ఇనుప వ్యర్థాల దుకాణాలు ఉండాలని ఆందోళన చేసినా పట్టించుకోవటం లేదు.

\- శివకృష్ణ, కాలనీవాసి



సాలర్‌నగర్‌లో నిర్వహించిన ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



రాచాలలో హనుమాన్ శోభాయాత్ర

# వైభవంగా హనుమాన్ జయంతి

» ఆంజనేయస్వామి కటాక్షం అందరిపై ఉండాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి » ఊరూరా శోభాయాత్ర



జడ్చర్లలో హనుమాన్ శోభాయాత్ర ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు



ప్రత్యేక అలంకరణలో ఆది ఆంజనేయస్వామి

మహబూబ్‌నగర్ న్యూటౌన్/టౌన్/దేవరకద్ర/గండీడ్/కోయిలకొండ/భూత్పూర్/నవాబ్‌పేట /రాజాపూర్/మిడ్జిల్/మూసాపేట/జడ్చర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పట్టణంలో పలు ఆలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. బండమీదిపల్లి, వీరన్నపేట, అప్పన్నపల్లి, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, ఏనుగొండ, గిర్నిగడ్డ ఆంజనేయ స్వామి ఆలయాల్లో, సాంబ శివాలయంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో వేకువజామును స్వామి వారికి పంచామృతాభిషేకాలతో అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలోని 3వ వార్డు అప్పన్నపల్లి ఆంజనేయ స్వామి ఆలయం, అంబభవాని ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంజనేయ స్వామి కరుణా కటాక్షాలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అప్పన్నపల్లి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ముస్లింలు ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభించారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు మనోహర్, శివశంకర్, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు, హరిబాబు, రామకృష్ణ, శేఖర్, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిమన్యురావు, బాండేకర్ విశ్వనాథ్, విజయ్‌కుమార్, పరాంకర్, లక్ష్మీనారాయణ, పతంగి పాల్గొన్నారు. దేవరకద్ర, కౌకుంట్ల, గండీడ్, కోయిలకొండ మండలం ఖాజీపూర్, నల్లవెల్లి, ఆచార్యపూర్, అనంతాపూర్ కోయిలకొండ గ్రామాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజల అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామికి ఫల పంచామృత అభిషేకంతో పాటు 1008 తమల పాకులతో అర్చన నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. భూత్పూర్, నవాబ్‌పేట, రాజాపూర్, మిడ్జిల్, హన్వాడ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల ప్రత్యేక పూజలతో పాటు హనుమాన్ చాలిస పఠించారు. మూసాపేట, అడ్డాకుల మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దాసరిపల్లిలో 41 రోజుల పాటు ఆంజనేయస్వామి మాలధారణ చేసిన భక్తులు ఇరుముడి ధరించి శ్రీశైలం యాత్రకు తరలివెళ్లారు. శాఖాపూర్ సీతారాంపల్లి చిత్రపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలతో పాటు విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. జడ్చర్ల పట్టణంలోని పాతబజార్, పారిశ్రామికవాడ, నిమ్మబాయిగడ్డ, నాగసాల గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. నాగసాల హనుమాన్ మందిరం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండ సీఐ కమలాకర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



పెద్దమునగాల్‌చేడ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మిడ్జిల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంచనపల్లి, వల్లభురావుపల్లి గ్రామాల్లో శనివారం రైతులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రాష్ట్రంలో రైతు ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి గ్రామాల్లోనే ధాన్యం అమ్ముకునేందుకు వీలు కల్పించిందన్నారు. కాంగ్రెస్ నాయకులు, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, నరసింహ, శ్రీనివాస్‌గౌడ్, బంగారు పాల్గొన్నారు.

● మూసాపేట : రైతులు పండించిన ధాన్యం దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ పొందాలని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కె.నాగిరెడ్డి అన్నారు. శనివారం అడ్డాకుల మండలం పెద్దమునగాల్‌చేడ్‌లో సింగిల్ విండో ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, డీసీసీ కార్యదర్శి విజయమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శకుంతలమ్మ పాల్గొన్నారు.

## మందకృష్ణను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవాబ్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను మండల ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. వర్గీకరణ కోసం పోరాటం చేసిన ఆయనను అభినందించినట్లు శాంతయ్య మాదిగ, కోస్గి శంకర్, కారుకొండ మైబు తెలిపారు. నాయకులు లోకిరేవు యాదయ్య, శ్రీనివాసులు, చెన్నయ్య, చంద్రయ్య, రమేష్, రాజు, లింగం, సురేష్, రాములు, వెంకటయ్య పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలో పోషక పక్షం కార్యక్రమం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 19వ వార్డు షాషాబ్ గుట్టలో శనివారం అంగన్ వాడీ కేంద్రంలో పోషక పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణులకు పోషక ఆహారంతో కలిగే లాభాలు, ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, సూపర్‌వైజర్ వసీం సుల్తానా, అంగన్ వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### భర్త ఆచూకీ కోసం భార్య ఫిర్యాదు

జడ్చర్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రంగయ్య కనిపించడం లేదని భార్య జగదీశ్వరి శనివారం ఫిర్యాదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. ఇందిరానగర్ కాలనీకి చెందిన రంగయ్య ఇంటి నుంచి కనిపించకుండా పోయి సంవత్సరం కావస్తుందని, రంగయ్య తాగిన మైకంలో పిచ్చి పిచ్చిగా ప్రవర్తించే వాడని దీంతో రెండు మూడు సార్లు ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడని తెలిపారు. ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నాట్లు సీఐ తెలిపారు. రంగయ్య ఆచూకి తెలిసిన వారు వెంటనే తమకు స్టేషన్‌లో తెలియజేయాలని సీఐ కోరారు

## భూమి మార్పిడిపై పోలీసులకు ఫిర్యాదు

నవాబ్‌పేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : తమకు తెలియకుండా భూమి పట్టా చేసుకుని ఇతరులకు విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ విక్రం తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని కొండాపూర్‌కు చెందిన కేశవులు పేరుమీద సర్వే నెంబర్ 133లో ఎకరా 31 గుంటల భూమి ఉంది. ఈ భూమిని రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన నక్క శ్రీను మరి కొందరు కలిసి అమృతమ్మ అనే మహిళపై పట్టా చేసి ఇతరులకు విక్రయించారని వీరిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం





హోమంలో పాల్గొన్న భక్తులు, లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



సత్యనారాయణ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పౌర్ణమి పురస్కరించుకుని శనివారం మండలంలోని మన్యంకొండ లక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకులు స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణతో మహోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్ తెలిపారు.

● చిన్నచింతకుంట : మండలంలోని బండర్‌పల్లి సమీపంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరరెడ్డి కల్యాణంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సతీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

**సత్యనారాయణ స్వామి వ్రతాలు**

మిడ్జిల్ : మండలంలోని ఓడికే వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు చైత్ర పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అంతకుముందు అర్చకుడు యుగేందర్‌శర్మ పూజలు చేశారు.

## కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

చిన్నచింతకుంట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నవడ్డెమాన్ గ్రామంలో శనివారం ఓఎంఐఎఫ్ ఆధ్వర్యంలో 36 మంది మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని కాంగ్రెస్ మండల నాయకుడు వట్టెం శివకుమార్, ఓఎంఐఎఫ్ కో-ఆర్డినేటర్ ఎల్లప్ప, జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొని, ప్రారంభించారు. మహిళలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమరేష్, బోరింగ్ శ్రీను, దయానంద్, ప్రిన్స్ రవీందర్, కురుమూర్తి, అంజి, చిన్న వడ్డెమాన్ ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్ పారిజాత పాల్గొన్నారు.

## గురువుల బాటలో విద్యార్థులు పయనించాలి



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మహబూబ్‌నగర్ (విద్యావిభాగం), ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : చదువు నేర్పిన గురువుల బాటలో విద్యార్థులు పయనించాల ని మెన్నోనైట్ బ్రేత్రేన్ క్రిష్టియన్ జూనియర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు తిమోతి, ఆంధ్రుష్, యాదవు, సంపత్‌కుమార్ అన్నారు. 2007-08 సంవత్సరంలో కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు శనివారం సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న క్రమంలో ప్రేమించి పెళ్లి చేసుకున్న విద్యార్థులు దివ్య, రాజశేఖర్‌ను సన్మానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలమాలతో సత్కరించారు. సురేందర్ బాబు, ఎల్లప్ప, రాజునాయక్, శంకర్‌నాయక్, గణేష్, శ్యాంసుందర్, అనిల్, నగేష్, త్రివేణి, ప్రకాశమ్మ, శిరీష, లావణ్య, వర్షిణి, లక్ష్మీ, బీబీ పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలి

మూసాపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామస్వామి గుట్టలో వెలిసిన పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అస్కని నరేందర్‌సాగర్ కోరారు. రెండో శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కమిటీ సభ్యులు, దాతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయం గుట్టపైకి రావడానికి మెట్లకు మరమ్మతులు, విగ్రహాల పునర్ ప్రతిష్ఠ, కోనేరు వద్ద నిర్మాణపు పనులు, భక్తుల మండప నిర్మాణపు పనులు, ఫ్లోరింగ్ టైల్స్ నిర్మాణాలపై చర్చించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలూరి గోవర్ధన్, మేరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఆవుల శేఖర్, శంకర్‌యాదవ్, తిరుపతిరెడ్డి, యుగంధర్ రెడ్డి, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ యువత స్వయం ఉపాధికి ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14 లోగా దరఖాస్తులను మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయాలన్నారు. సెలవు దినాల్లో కూడా ప్రజాపాలన కేంద్రాలు తెరచుకొని ఉంటాయని తెలిపారు.

## విద్యాశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

రాజాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులచే నృత్యాలు, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో సుధాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, గోపికాంత్, ఉదయ్‌కుమార్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## మూల్యాంకనం రేట్లు పెంచాలి




మెరుపు ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి మూల్యాంకన రేట్లు ఎనిమిదేళ్లుగా పెంచడం లేదని నిరసిస్తూ శనివారం పది మూల్యాంకన కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాలు మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ మూల్యాంకనానికి ప్రతీ పేపర్‌కు రూ.10 నుంచి రూ.20 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రూ.250 నుంచి రూ.750 వరకు పెంచాలన్నారు. నాలుగో తరగతి ఉద్యోగులకు రోజంతా పని చేస్తే రూ.83 ఇవ్వడం దారుణమన్నారు. వారికి కనీసం రోజుకు రూ.500 చెల్లించాలన్నారు. మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించలేదని ఆరోపించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగ అధికారి కమలాకర్ శర్మకు అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవికుమార్, రవీందర్‌గౌడ్, నారాయణ, సురేంద్రనాథ్, రామ్‌రెడ్డి, మురళి, గోపిశంకర్, రఫీక్ పాల్గొన్నారు.